క్లుప్తంగా

దివ్యాంగులకు చేయూతనందిస్తాం

నల్లగొండ టూటౌన్ : దివ్యాంగుల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి చేయూత నందిస్తామని చేయూత ఆశ్రమం చైర్మన్ గోలి ప్రభాకర్ అన్నారు. సోమవారం నల్లగొండలో చేయూత ఆశ్రమం కార్యాలయంలో లోగో, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

అబాకస్ చాంపియన్‌గా అక్షర



చిట్యాల: గ్లోబల్ లెవల్ అబాకస్–2025 చాంపియన్‌గా చిట్యాల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఐదో తరగతి విద్యార్థిని ఎం.అక్షర నిలిచిందని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ హరిశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో అక్షరకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ చాంపియన్ షిప్ అవార్డు అందజేసినట్లు పేర్కొన్నారు.

న్యాయం చేయాలని వినతి

చండూరు (గట్టుప్పల్) : గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామ పంచాయతీ ఆవాసం సోమరాజుగూడ, రంగంతండా గ్రామాల పరిధిలో రైతు భరోసా అందడం లేదని రైతులు సోమవారం గట్టుప్పల్ తహసీల్దారు రాములుకు వినతి పత్రం అందజేశారు. 280 సర్వే నంబర్‌లో ఆన్‌లైన్‌లో మిస్సింగ్‌తో రైతు భరోసాకు దూరమయ్యామని వివరించారు.

లచ్చిరాంకు డాక్టరేట్



నల్లగొండ: మర్రిగూడ మండలం దామరభీమనపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంకు అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీకి చెందిన ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు తనను డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేసినట్లు లచ్చిరాం తెలిపారు. ఈ నెల 28న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో యూనివర్సిటీ కోఆర్డినేటర్ కల్చర్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమిక్ ఫౌండర్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని ఉమెన్స్ కాలేజీలో పోటీ పరీక్షలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. సివిల్స్, గ్రూప్స్ పరీక్షలు ఏవిధంగా ప్రిపేర్ కావాలో హైదరాబాద్ ఏకేఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఎం.ఏ.శ్రీనివాసన్, నాగరాజు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరాజు, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కంటిచూపుపై శ్రద్ధ వహించాలి

నల్లగొండ టౌన్: విద్యార్థుల కంటిచూపుపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం కింద పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

కారు డ్రైవర్‌కు జైలు

కట్టంగూర్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు సంవత్సరం జైలు శిక్షతోపాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ నకిరేకల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ సోమవారం తీర్పు వెలడించారు. కట్టంగూర్ ఎస్‌ఐ మునుగోటి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 29 ఏప్రిల్ 2016న నల్లగొండ మండలం రాములబండ గ్రామానికి చెందిన వరికుప్పల నర్సింహ తన కుటుంబ సభ్యులతో కలిసి వివాహ నిశ్చితార్థం నిమిత్తం ఆటోలో స్వగ్రామం నుంచి సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలోని కట్టంగూర్‌లో గల నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి సూర్యాపేట వెళుతున్న కారు డ్రైవర్ సురుగు అశోక్ అతివేగంగా నడుపుతూ ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. అప్పటి ఎస్‌ఐ ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేయగా సోమవారం నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

వైభవంగా రథోత్సవం

నాంపల్లి : మండలంలోని మేళ్లవాయి గ్రామంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరుపుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, రథోత్సవం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ గట్లా రాధారాజశేఖర్ రెడ్డి, రామేశ్వర్‌రావు, రాంబాబు, నర్సింహారావు, శేఖర్, నరహరి, సైదులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ

నకిరేకల్ : నల్లగొండ–ఖమ్మం ఉమ్మడి జిల్లాల లయన్స్ క్లబ్ గవర్నర్ పదవులకు నామినేషన్ స్వీకరణ సోమవారం ప్రారంభమైంది. గవర్నర్ పదవికి నల్లగొండకు చెందిన రేపాల మదన్‌మోహన్, ఉప గవర్నర్ పదవికి కేవీ ప్రసాద్ తమ నామినేషన్ పత్రాలను నకిరేకల్‌లో లయన్స్ క్లబ్ ప్రతినిధి, ఎన్నికల అధికారి డాక్టర్ యానాల మోహన్‌రెడ్డికి అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక

నకిరేకల్ : భవన నిర్మాణ తాపీ వర్కర్స్ యూనియన్ నకిరేకల్ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా మంటిపల్లి కృష్ణయ్య, కార్యదర్శిగా మేడిపల్లి భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొటాష్ కొంటేనే.. యూరియా!

- షరతులు విధిస్తున్న ఫర్టిలైజర్ దుకాణదారుడు
- అవసరం లేకపోయినా ఎలా కొనుగోలు చేస్తామని ప్రశ్నిస్తున్న రైతులు
- అధికారులకు ఫిర్యాదు చేసినా యూరియా ఇవ్వని దుకాణ యజమాని



చిట్యాలలోని మన గ్రోమోర్‌లో నిల్వ ఉన్న యూరియా బస్తాలు

చిట్యాల: రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను ఫర్టిలైజర్ షాపుల యజమానాలు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా అందించాల్సి ఉంటుంది. అయితే చిట్యాలలో ఫర్టిలైజర్ దుకాణదారులు మాత్రం పొటాష్ కొంటేనే యూరియా బస్తాలు ఇస్తామని షరతులు పెడుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

యూరియా నిల్వలు ఉన్నా..

చిట్యాల పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో యూరియా బస్తాల నిల్వలు ఉన్నప్పటికీ సోమవారం రైతులకు ఇవ్వలేదు. తప్పనిసరిగా ఒక యూరియా బస్తాతోపాటు పొటాష్ బస్తా కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని చెబుతుండడంతో రైతులు ఏం చేయాలో అర్థంకాక ఇబ్బందులు పడ్డారు. అవసరం లేకపోయినా పొటాష్ కొనుగోలు ఎలా చేయాలని రైతులు వాపోతున్నారు. యూరియా ఇవ్వనట్లయితే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని వాదిస్తే.. తమ దుకాణంలో యూరియా నిల్వలు లేవని చెప్పి రైతులను తిప్పి పంపుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకుని యూరియా సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

యూరియా ఇవ్వలేదు



యూరియా కొనుగోలు చేయాలని చిట్యాలలోని మన గ్రోమోర్ సెంటర్‌కు వచ్చాను. పొటాష్ కొనుగోలు చేస్తేనే యూరియా బస్తాలు ఇస్తామని దుకాణదారుడు లింకు పెట్టాడు. గోదాములో యూరియా బస్తాలు ఉన్నప్పటికీ స్టాక్ లేదని చెబుతున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారికి ఫిర్యాదు చేసినా మన గ్రోమోర్ ఎరువుల షాపులో యూరియా ఇవ్వలేదు.
– ఏనుగు సుధాకర్ రెడ్డి, రైతు, వెలిమినేడు, చిట్యాల మండలం

షరతులు పెడితే చర్యలు తీసుకుంటాం



ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఎరువులను ఫర్టిలైజర్ షాపుల యజమానులు అందించాలి. ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఇబ్బందులకు గురిచేసినట్లయితే వెంటనే నా సెల్ నంబర్ 7288894506కు ఫిర్యాదు చేయండి. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, షరతులు పెట్టినా.. ఫర్టిలైజర్ షాపులపై చర్యలు తీసుకుంటాం.
– పగిడిమర్రి గిరిబాబు, మండల వ్యవసాయాధికారి, చిట్యాల

లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని నీలగిరి కాలనీలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం యంత్ర విగ్రహ, ధ్వజస్తంభ, గోపుర శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం ఆగశాలలో ద్వారాతోరణ పూజ, పూర్ణాహుతి కుంభయాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఆంజనేయ జండా ప్రచండ, గరుడ, నూతన శిల ధ్వజస్తంభ, విమానా శిఖర కలశ ప్రతిష్ఠాపన, మహాకుంభ సంప్రోక్షణ, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, ఆశీర్వచనం, రిత్విక్ సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ఆపద మిత్ర సభ్యుల సర్వే

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులో ఆపద మిత్ర సభ్యులు సోమవారం సమగ్ర సర్వే నిర్వహించారు. ప్రజలు ఏదైనా ఆపదలో ఉంటే తమవంతు సహాయ, సహకారాలు అందించే ఆపద మిత్ర బృందానికి వారం రోజులుగా డీఆర్‌డీఏ, పీఆర్‌ఏ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో భాగంగా సోమవారం 50 మంది టీమ్ సభ్యులతోపాటు డీఆర్‌డీఏ అధికారులు మునుగోడులో పర్యటించి ప్రజల స్థితిగతులు, ప్రస్తుతం ఉన్న వనరులు, ఇంకా కల్పించాల్సిన సౌకర్యాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో నల్లగొండ క్లస్టర్ ఏపీడీ నర్సింహారావు, వి.మధు, రాంమూర్తి పాల్గొన్నారు.

శివస్వాముల మహా పడిపూజా మహోత్సవం



మహాపడిపూజలో పాల్గొన్న మాలధారులు

శాలిగౌరారం: మండల కేంద్రంలోని శివమాలధారులు సోమవారం పార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ద్వాదశ జ్యోతిర్లింగ పంచమ మహాపడిపూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివపార్వతుల చిత్రపటాలతోపాటు శివలింగం, నంది విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాలిగౌరారంతోపాటూ నకిరేకల్, కట్టంగూరు, కేతేపల్లి, సూర్యాపేట, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాలకు చెందిన 150 మంది శివమాలధారులు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు 1200 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ వంశపారంపర్య పూజారి దాచవరం రాంబాబుశర్మ, గురుస్వామి కట్టగూరి వెంకన్న నేతృత్వంలో పూజా కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి.

ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవం

చండూరు : మండలంలోని బంగారిగడ్డ ప్రభుత్వ పాఠశాల ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్ రెడ్డి, హెచ్‌ఎంలు చిక్కుళ్ల రామలింగయ్య, మాదగాని వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పల్లె వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎడ్ల భిక్షం, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ అరెస్ట్

నల్లగొండ: ఓ వ్యక్తిని చంపేస్తానంటూ బెదిరించిన రౌడీ షీటర్‌ను విచారించేందుకు వెళ్లిన పోలీసులను అతడి అనుచరులతో కలిసి ప్రతిఘటించగా అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి నలపరాజు రాజేష్ అలియాస్ మెంటల్ రాజేష్ గతంలో పలు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పది, పదిహేను మందిని వెంట తిప్పుకుంటూ సెటిల్‌మెంట్లు చేస్తూ, అమాయకులను బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఇటీవల ఓ మతానికి చెందిన వ్యక్తికి ఫోన్ చేసి చంపేస్తానంటూ బెదిరించగా.. బాధితుడి నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ నిమిత్తం సోమవారం నల్లగొండ పట్టణంలో రాజేష్ ఉంటున్న ప్రాంతానికి పోలీసులు వెళ్లగా... అప్పటికే గంజాయి మత్తులో ఉన్న రాజేష్ పోలీసులను ప్రతిఘటించి చుట్టూ ఉన్న అతడి అనుచరులను పోలీసుల మీదకు ఉసిగొల్పి బీభత్సం సృష్టించడంతో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రాజేష్‌పై 17 కేసులు, పీడీ యాక్ట్ ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

చిట్యాల: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. చిట్యాల ఎస్‌ఐ ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటలోని శాంతినగర్‌కు చెందిన ధరావత్ సాయి ప్రసాద్(20) హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతని తండ్రి చందు ఇటీవల అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోపాటు జీవితంపై విరక్తి చెందిన సాయి ప్రసాద్ ఈ నెల 16వ తేదీన హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చేందుకు బయలుదేరాడు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని గాంధీ గుడి సమీపంలోకి చేరుకుని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వైద్య చికిత్సకుగాను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ సోమవారం సాయి ప్రసాద్ మృతి చెందాడు. మృతుడి తల్లి ధరావత్ లలిత ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూటీ మీద వస్తూ..

జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పంతంగి గ్రామానికి చెందిన కడెం వీరయ్య స్కూటీపై ఈ నెల 14వ తేదీన చిట్యాల నుంచి స్వగ్రామం పంతంగి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెలిమినేడు గ్రామ శివారులోని పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు వద్దకు రాగానే వీరయ్య నడుపుతున్న స్కూటీని చిట్యాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఇన్నోవా కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి కుమారుడు పరమేష్ రెండు రోజుల క్రితం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ గుత్త మంజులమాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ కుమ్మరి నాగయ్య పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో మైసమ్మ గుడి నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమంలో గుడి నిర్మాణ దాతలు బుడిగ సైదులు–అనూష దంపతులు, అంబేద్కర్ నగర్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు. మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్ గుడి నిర్మాణానికి రూ.30 వేలను విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నకిరేకల్ : పట్టణంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఓవర్ లోడ్ కారణంగా అదనంగా మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. నకిరేకల్ సబ్‌స్టేషన్‌కు ప్రస్తుతం కట్టంగూరు మండలం అయిటిపాములలోని 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. నకిరేకల్‌లో ఇండస్ట్రీలు ఉన్నందున సబ్ స్టేషన్‌పై ఓవర్ లోడ్ పడుతోంది. దీంతో విద్యుత్ అధికారులు సోమవారం మరో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. ఏడీఏ సురేష్‌కుమార్, ట్రేడ్ ఏడీఏ శ్రీనివాస్, ఏ ఈలు సాయిగణేశ్, సతీష్, రమ్య పర్యవేక్షించారు.

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

కేతేపల్లి: ఈస్తమా మండల్ జోడ్ సందర్భంగా సోమవారం కేతేపల్లిలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్‌జానీని సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ ఫరీద్, రహీం, ఇబ్రహీం, కరీం, సిద్దిక్, అన్వర్ పాల్గొన్నారు.

నర్సరీల పెంపకాన్ని వేగవంతం చేయాలి

నల్లగొండ : నర్సరీల పెంపకాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం నల్లగొండలోని కలెక్టరేట్‌లో మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏపీఓలు, ఎంసీఓలతో వివిధ అంశాలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై సమీక్షించారు. జనవరి 26న పథకాన్ని ప్రారంభించిన 31 గ్రామపంచాయతీల మాదిరిగానే, మిగతా గ్రామాల్లో జాబితాల పరిశీలనను ఈనెల 20లోపు పూర్తి చేయాలన్నారు. డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 69 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

- ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

నల్లగొండ టూటౌన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డి గెలుపు ఖాయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన నల్లగొండ పట్టణంలోని పలు ప్రైవేట్ కాలేజీలు, పాఠశాలలకు వెళ్లి పులి సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటు అడిగే దమ్ము లేక అభ్యర్థులను నిలబెట్టలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కనులపండువగా గంగాభవాని ఉత్సవాలు



గంగదేవమ్మకు నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

కేతేపల్లి: మండలంలోని ఉప్పలపహాడ్ సమీపంలోని మూసీ నది వెంట ఉన్న గంగమ్మ తల్లి జాతర సోమవారం కనులపండువగా సాగింది. సూర్యాపేట జిల్లాలో జరుగుతున్న పెద్దగట్టు జాతరకు వెళ్లిన జనమంతా అక్కడ మొక్కులు తీర్చుకుని తిరుగు ప్రయాణంలో మార్గమధ్యలో ఉప్పలపహాడ్ వద్ద మూసీ నదిలో ఉన్న గంగమ్మ తల్లి వద్ద ఒక రోజు నిద్ర చేసి తల్లికి బోనాలతో పాటు జంతువులను బలివ్వడం ఆనవాయితీ. మూడు రోజుల పాటు కొనసాగే ఈ జాతరకు పెద్దగట్టు జాతరలో పాల్గొన్న భక్తులు సోమవారం ఉప్పలపహాడ్ సమీపంలోని మూసీ నది వద్దకు చేరుకున్నారు. భక్తులు బోనం వండే పాలు, పెరుగు, బియ్యం, పసుపు కుంకుమ వంటి నవ ధాన్యాలున్న గంపలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. డప్పుచప్పుళ్లు, నృత్యాలతో నదిలో వెలిసిన గంగమ్మ తల్లికి కత్తులు, బోనాలు సమర్పించి జంతు బలులిచ్చారు. నదిలో స్నానమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. నదిలో ఉన్న రాతిబండపై వెలిసిన గంగభవాని తల్లి, శ్రీవేంకటేశ్వర స్వామి, రామచంద్ర స్వామి, సీతమ్మలను దర్శించుకున్నారు.

లింగమంతులస్వామి గొల్లగట్టు జాతర



మర్రిగూడ బైపాస్‌లో వేడుకల్లో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ రోడ్‌లో గొల్లగట్టు లింగమంతుల స్వామి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి బోనాలు, డప్పు చప్పుళ్లు, కత్తులతో ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ లింగమంతుల జాతరలో పాల్గొని డోలు వాయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు వీరల్లి చంద్రశేఖర్, గొల్లగట్టు ఆయల అధ్యక్షుడు మర్రి సత్తయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి లింగస్వామి కోశాధికారి సుధాకర్, దొండ ముత్తేష్‌యాదవ్, బూర నాగయ్య, వెంకన్న,శివ, అంజి సందీప్ ప్రవీణ్, గణేశ్, మల్లేష్ సాయి, సురేష్, వెంకటేష్, వెంకన్న, నగేష్‌లు పాల్గొన్నారు.

నేరడ శివారులో..

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామ శివారులో లింగమంతుల చిన్న గట్టు జాతర సోమవారం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా లింగమంతుల స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. యాదవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కంబాలపల్లి సతీష్‌కుమార్ యాదవ్, గ్రామ పెద్దలు చీరబోయిన వెంకన్న యాదవ్, నర్సింహయాదవ్, శ్రీశైలంయాదవ్, వేణుయాదవ్, శ్రీనాథ్‌యాదవ్, నవీన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

నకిరేకల్ : తెలంగాణ బాపూజీ కేసీఆర్ అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ పట్టణంలో బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఏరియా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మెయిన్ సెంటర్‌లో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మీ,స్వర్ణలత, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



నకిరేకల్ : కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



కనగల్: కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రసన్నరాజ్ ఆధ్వర్యంలో ..

కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం నకిరేకల్ పట్టణంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నలగాటి ప్రసన్నరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చల్లా కృష్ణారెడ్డి, యల్లపురెడ్డి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టుటౌన్: కేసీఆర్ జన్మదినం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి సోమవారం హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో రోగుల కోసం ఆస్పత్రి ఆర్‌ఎంఓకు 20 వీల్ చైర్లను బహూకరించారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



మునుగోడు : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



చిట్యాలలో..

కట్టంగూర్‌లో ..

కట్టంగూర్ : కేసీఆర్ జన్మదిన వేడుకలను కట్టంగూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములు యాదవ్ కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పోగుల నర్సింహ, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, వడ్డె సైదిరెడ్డి, ఎడ్ల పురుషోత్తంరెడ్డి, నోముల వెంకటేశ్వర్లు, దాసరి సంజయ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం నార్కట్‌పల్లి బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. చెర్వుగట్టు గ్రామంలో మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, దోసపాటి విష్ణు, మేకల రాజీరెడి బద్దం రాంరెడ్డి పాల్గొన్నారు.

కనగల్: దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్య గౌడ్, వంగాల సహదేవరెడ్డి, కరీంపాషా, నర్సిరెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: మండల వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జడల ఆదిమలయ్య యాదవ్, చిట్యాల పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి పాల్గొన్నారు.

మర్రిగూడ : కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, చెరుకు లింగంగౌడ్ పాల్గొన్నారు.

చండూరు : కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్, మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, మాజీ కౌన్సిలర్లు కోడి వెంకన్న, గుంటి వెంకటేశం, అధికార ప్రతినిధి బొడ్డు సతీష్‌కుమార్, అనిల్ రావు పాల్గొన్నారు.

మునుగోడు: కేసీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం మునుగోడులో ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మందుల సత్యం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. పగిళ్ల సతీష్, ఈద శరత్‌బాబు, మాదర బోయిన పరమేష్, పూల వెంకన్న, బాలరాజు, ఏరుకొండ శ్రీనివాస్, విజయ్, సురేష్, వల్లూరి లింగయ్య, సింగం సైదులు తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు మండలంలోని గురుజాల–మానాయికుంట బ్రిడ్జిపై సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, ప్రధాన కార్యదర్శి చాడ హతీష్‌రెడ్డి, గుజిలాల్ శేఖర్‌బాబు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి చదువుతున్న కందికంటి బన్ని, పైళ్ల ఉదయయ్ కుమార్, చిట్టిమల్ల శివ ప్రసాద్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం కర్ర వీరారెడ్డి, పీఈటీ చైతన్యకుమార్ తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ అంతర్ జిల్లాల సబ్‌బ్ జూనియర్ పోటీల్లో వీరు పాల్గొనన్నారని తెలిపారు.

కట్టంగూర్: మండలంలోని చెర్వున్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి గద్దపాటి హర్ష, 8వ తరగతి విద్యార్థి అంబారిపేట రిషి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కందాల రమ, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతమల్ల పుల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరు ఈ నెల 20వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న రెండో జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు రాంమోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కోటిలింగం, నరహరి, నాగేష్, సంపత్‌కుమార్, లింగయ్య, మంగ , సిబ్బంది అభినందించారు.

పాఠశాలలో చోరీ

నకిరేకల్ : తాటికల్ హైస్కూల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. పెద్దగట్టు జాతర సందర్భంగా సోమవారం సెలవు కావడంతో పాఠశాల నైట్ వాచ్‌మెన్ రాములు వాటర్ ట్యాంక్ గేట్ వాల్వ్ బంద్ చేయడం కోసం పాఠశాలలోకి వెళ్లాడు. ఈ క్రమంలో పాఠశాల వంట గది తాళం పగిలి తలుపు తెరిచి ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే స్థానికులకు, పాఠశాల వంట మనుషులకు సమాచారం అందించాడు. వారు వచ్చి వంట సామగ్రి చోరీ అయినట్టు నిర్ధారించారు. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ మేకల నాగయ్య సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు.

పూడిక తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

నకిరేకల్ : పట్టణంలోని శ్రీకనక దుర్గ అమ్మవారి ఆలయ సమీపంలో మెయిన్ రోడ్డు వెంట ఉన్న ప్రధాన డ్రైయినేజీలో సోమవారం పూడిక తీత పనులు చేపట్టారు. డ్రైయినేజీలో పూడిక పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో ఈ నెల 13వ తేదీన సాక్షి దినపత్రికలో డ్రైయినేజీ పనులు పూర్తయ్యేనా ? అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపాలిటీ అధికారులు పారిశుద్ధ్య సిబ్బందితో కాల్వలో పూడిక తీయించారు.



కాల్వలో పూడిక తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది